సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



రైల్వేలో మోగిన ఎన్నికల నగారా

భారతీయ రైల్వేలో ఎన్నికల నగారా మోగింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలకు రైల్వే యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. -8లో



దారి దోపిడీ ముఠా అరెస్ట్

జాతీయ రహదారిలో తిరిగే లారీలను లక్ష్యంగా చేసుకుని.. డ్రైవర్లను చంపుతామని బెదిరించి వారి నుంచి నగదును దోచుకునే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.4/26.8

వాతావరణం

జిల్లాలో శనివారం 26.8 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్


న్యూస్‌రీల్

కానిస్టేబుల్‌పై వేటు

ప్రొద్దుటూరు క్రైం: పేకాట ఆడుతూ పట్టుబడ్డ కానిస్టేబుల్‌పై ఎస్పీ వేటు వేశారు. ఈ నెల 7న దొరసానిపల్లెలో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడిలో 17 మందిని అరెస్ట్ చేశారు. వారిలో కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న శివ అనే కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. దీనిపై రూరల్ పోలీసు అధికారులు ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు నివేదిక పంపిచారు. విచారణ అనంతరం కానిస్టేబుల్ శివను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ శివ మాలెపాడు గ్రామంలో పికెటింగ్ విధులు నిర్వహిస్తున్నాడు.

24న ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 24న జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి తెలిపారు. రెజ్లింగ్ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు



నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా కడప డీఎస్‌ఏ స్టేడియంలో అదే రోజు బాస్కెట్‌బాల్ అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

28న అథ్లెటిక్స్ ఎంపికలు..

ఈనెల 28న ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపికలు కడప నగరంలోని వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలకు తేదీలు వచ్చిన కారణంగా జిల్లాలోని అన్ని మండలాలు, నియోజకవర్గస్థాయి ఎంపికలు పూర్తి చేసుకుని ఈనెల 28వ తేదీన కడపలో నిర్వహించే జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు క్రీడాకారులను పంపాలని కోరారు.

సౌమ్యనాథుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

నందలూరు: నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గమ్మినేని రామకృష్ణ ప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టత గురించి వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట విశ్రాంత రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సీతారామమూర్తి దంపతులు, వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, నందలూరు కోర్టు మేజిస్ట్రేట్ భార్గవి, రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్, నందలూరు కోర్టు సూపరింటెండెంట్ రమేష్, టీటీడీ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

సంబేపల్లి/చిన్నమండెం: సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో, చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్డీఓ రంగస్వామి, మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నాగేశ్వరనాయుడు, శ్రీధర్ రెడ్డి, నాయకులు శివప్రసాద్,రంగారెడ్డి, సిద్దారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

కడప రూరల్: జీవో నంబర్ 85ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు నల్లరిబ్బన్‌లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ జీవో 85 వల్ల పీహెచ్‌సీ లో పని చేసే వైద్యులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అలాగే ఈ జీవో కారణంగా గ్రామీణ ప్రజలకు స్పెషలిస్ట్ వైద్య సేవలు అందవని తెలిపారు. ప్రభుత్వం తక్షణం జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ వినయ్ కుమార్, ట్రెజరర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. పప్పు ఎప్పుడిస్తారు

తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు మంచి చేయకపోగా అడుగడుగునా వంచిస్తోంది. ముఖ్యంగా పేద ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనే వారిలో కరువైంది. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని పోషకాహారం సరఫరా చేస్తుండడం పాలకుల మోసపు నైజానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

- అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిపోయిన కందిపప్పు సరఫరా
- పోషకాహారంలో నాణ్యత కరువు
- పునరుద్ధరించాలని కోరుతున్న లబ్ధిదారులు



పౌష్టికాహారంతోపాటు కందిబేడలు అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్త (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధి సీఎం చంద్రబాబుకు కరువైంది. ముఖ్యంగా వైఎస్ జగన్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలకు పేర్లు మార్చడంలో చూపుతున్న శ్రద్ధ పథకాలను అమలు చేయడంలో లేకుండా పోయింది. అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకమైన పోషకాహారం అందజేస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవస్థలకు గురి చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కంటే గొప్పగా అమలు చేస్తామని గ్రామగ్రామాన ఊదరగొట్టారు. తీరా గద్దెనెక్కిన తర్వాత వాటనన్నింటినీ విస్మరిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి పేరు మార్పు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీకి వైఎస్సార్ సంపూర్ణ పోషణ అని పేరు పెట్టారు. ఈ పథకం కింద గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహార కిట్లు అందించేవారు. ఇందులో నెలకు సరిపడా మూడు కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, అరకిలో నూనె, రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావుకిలో ఖర్జూరం, పావుకిలో చిక్కీలు, పావుకిలో బెల్లం, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు చొప్పున అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి 'బాల సంజీవిని' అని పేరు మార్చడం మినహా చేసిందేమీ లేదు. పైగా సదరు కిట్లలో వస్తువుల్లో కోత కోయడంతో పాటు నాణ్యతకూ మంగళం పాడారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు..

జిల్లాలో ఇలా..

- 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులు
- 2389 అంగన్వాడీ కేంద్రాలు
- 13256 నమోదైన గర్భిణులు
- 13719 నమోదైన బాలింతలు
- 102235 నమోదైన చిన్నారులు

'కంది పప్పు' లేకుండానే..



గతంలో అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కందిపప్పు

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులను దృష్టిలో పెట్టుకుని ప్రతినెలా 56 వేల కిలోల కంది పప్పును సరఫరా చేస్తూ వచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కందిపప్పును సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు నెలలుగా నిలిచిపోయిన కందిపప్పు ఈనెలలో కూడా సరఫరా అయ్యే పరిస్థితి లేదంటున్నారు. దీంతో లబ్ధిదారులకు ఏం పెట్టాలో.. ఎలా సర్దిచెప్పాలో అర్థం కావడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు డబ్బును వెచ్చించి పప్పును కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

మెనూలో కంది కీలకం



కందిబేడలు, ఇతర పౌష్టికాహారాన్ని తీసుకు వెళుతున్న గర్భవతి (ఫైల్)

గర్భిణులకు పోషకాహార మెనూలో కంది పప్పు కీలకం. ప్రతిరోజు ఏదో ఒక కూరగాయలతో కలిపి పప్పు ఉండాలి. గర్భిణీలు, బాలింతలంతా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి రేషన్ తీసుకెళ్లేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు రాలేని వారికి కూడా ఇంటికే సరుకులను అందించి ఆసరాగా నిలిచేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఈ పద్ధతికి చెల్లుచీటి పాడారు. లబ్ధిదారులకు కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కేంద్రాలకు వచ్చే కార్యకర్తలు వంటకాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పౌష్టికాహారం నిలిచిపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కందిబేడలు రాగానే అందించేలా చర్యలు

జిల్లాలో గత కొన్ని నెలలుగా కందిబేడల సరఫరా నిలిచిపోయిన విషయం వాస్తవమే. ప్రస్తుతం కందిబేడల సరఫరాకు సంబంధించిన టెండర్ పనులు పూర్తయ్యాయి. ఈనెలలో కందిబేడలు సరఫరా అవుతాయని భావిస్తున్నాం. కేంద్రాల్లోని లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా అందరికీ బేడలు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం. - శ్రీలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, కడప

జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక

- కలెక్టర్ శివశంకర్



కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రణాళిక రూపకల్పనపై చర్చించారు. ఈనెల 30 నాటికి మండల, అక్టోబరు 15 నాటికి జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వర్ణాంధ్ర–స్వర్ణ కడప అంశంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రతి రంగంలో 15 శాతం గ్రోత్ రేట్‌ను నిర్దేశించుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చర్ క్లస్టర్, సోలార్ విండ్ ఎనర్జీలు, ఉద్యాన పంటలు, టూరిజం వంటి ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలన్నారు. వచ్చేనెల 5వ తేది వరకు ప్రజాప్రతినిధులు, రైతులు, జిల్లా ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించాలని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి, రూరల్ డెవలప్‌మెంట్, ప్రణాళిక, వ్యవసాయం, సర్వీసు సెక్టార్ వంటి రంగాల్లో అనుభవం ఉన్న విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: పలువురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో పనిచేస్తున్న రమేష్‌ను కర్నూలు, సువర్ణదేవిని నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న సుబ్బలక్షుమ్మను, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న దస్తగిరయ్యను కడపకు బదిలీ చేశారు. అలాగే అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఉదయ్‌శంకర్ రాజు, సక్సేనాలను సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలి





కార్యక్రమంలో పాల్గొన్న జ్యుడిషియల్ అధికారులు, న్యాయవాదులు, మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు జస్టిస్ రామకృష్ణప్రసాద్

హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్

కడప అర్బన్ : అందరికీ న్యాయం అందాలని, న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ (కడప యూనిట్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి) పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి జ్యుడిషియల్ అధికారుల కాన్ఫరెన్స్‌పై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు హాజరు కాగా ముఖ్య అతిథిగా హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పోక్సోయాక్ట్, డొమెస్టిక్ వైలెన్స్, చైల్డ్ అబ్యూజింగ్ యాక్ట్‌పై న్యాయవాదులు నిబద్ధతతో చట్టాలను అమలు చేయాలని సూచించారు. న్యాయవాద వృత్తి దైవంతో సమానమని, సామాన్యులకు న్యాయ సేవలు అందించాలని సూచించారు. న్యాయసేవలను పొందడం, ప్రతి ఒక్కరి హక్కని అన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా న్యాయాన్నందించే స్వేచ్ఛ, అలాగే రాజ్యాంగంలోని చట్టాలను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ జడ్జి సీతారామమూర్తి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీదేవి, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి మాధవరావు, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి అన్వర్‌బాషా, జిల్లా న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, బసవతారకరామ లా కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదినిమ్మాయపల్లెకు జలకళ



కళ్ల లోతుల్లోకెళ్లి... చక్కిలిగింతలు పెట్టే నీటి సవ్వళ్లు.. మనసును మైమరపించే సుగంధాల్లా.. జాలువారే అక్కడి అందాలు.. మనుషుల్ని మాయ చేస్తాయి. జాలరి గాలానికి చిక్కకుండా తప్పించుకు తిరిగే చేప పిల్లల అల్లర్లు... ఆ ఆనకట్ట సోయగాలు మనుషుల్ని కట్టి పడేస్తాయి.. కడప నగర శివార్లలో.. వల్లూరు మండలంలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట జలసిరితో కళకళలాడుతోంది. ఇటీవల వచ్చిన వరదలకు కొత్త అందాలు సంతరించుకుంది. ఓ వైపు జాలర్ల విన్యాసాలు.. మరోవైపు నీటి ప్రవాహాలు పర్యాటకులను ఫిదా చేస్తున్నాయి - వల్లూరు

ఆహ్లాదం.. ఆట విడుపు

అరుదైన వృక్షాలు.. పక్షుల కిలకిలారావాలు. వన్యప్రాణుల కేరింతలు.. ఇలాంటి ప్రకృతి రమణీయ దృశ్యాలను.. పచ్చిక బయలులో కూర్చొని చూడాలని ఎవరికి మాత్రం ఉండదు. కాని నిత్యం ఉరుకుల పరుగుల జీవితం గడిపే నగర వాసికి అలాంటి అవకాశం చాలా తక్కువ. అందువల్లే నిత్యం ఒత్తిడితో గడిపే నగర వాసులకు ఆహ్లాదం పంచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికి ఈ వనాలు పూర్తి కావచ్చాయి. అటవీభూముల పరిరక్షణతోపాటు ప్రజల ఆహ్లాదం కోసం నగరవనాలను అన్నమయ్య జిల్లాలో పలుచోట్ల ఏర్పాటు చేస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ సర్కారు కృషితో పట్టణాలకు అటవీశోభ
- రూ.6కోట్లకుపైగా వ్యయం
- నాలుగుచోట్ల చకచకా నగరవనాలు
- వనాల్లో పవిత్ర వృక్షాల పెంపకం



రాజంపేటలో ఏర్పాటు చేసిన అన్నమయ్య ఎకో పార్కు ముఖద్వారం

రాజంపేట : ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నగరవనాలు అన్నమయ్య జిల్లా వాసులకు అందుబాటులోకి వచ్చాయి. నిధులు మంజూరు చేశారు. అటవీ శాఖ జిల్లా కేంద్రంలో అన్నమయ్య ఎకో పార్కు పేరుతో పూర్తి చేశారు. అలాగే అన్నమయ్య జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లెలో నగర వనాలను ఏర్పాటు చేశారు. కాంక్రీట్ జంగిల్‌లా బతికే పట్టణ వాసులు ప్రకృతి మధ్య సేద తీరేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం జిల్లాలో నాలుగు చోట్ల నగరవనాలకు రూపకల్పన చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల మెప్పు పొందింది. జిల్లాలో దాదాపు పట్టణ శివార్లలో అటవీ ప్రాంతంలో అటవీ అందాలు తిలకించే విధంగా నగరవనాలు రూపుదిద్దుకున్నాయి. ఈ నేపథ్యంలో నగర వనాల నిర్మాణ పనులు శరవేగంతో పూర్తి కావచ్చాయి. ప్రకృతి అందాలు కనువిందు చేయనున్నాయి. ఆ విధంగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ సిద్ధమైంది.

పట్టణం	దూరం (కి.మీ)	రూ.వ్యయం	రూ. విడుదల	రూ. ఖర్చు
రాజంపేట	11	2 కోట్లు	1.4 కోట్లు	1.3 కోట్లు
మదనపల్లె	టౌన్	2 కోట్లు	1 కోటి	1 కోటి
రాయచోటి	9	2 కోట్లు	1.4 కోట్లు	1.4 కోట్లు
రైల్వేకోడూరు	1.50	50 లక్షలు	50 లక్షలు	30లక్షలు



నగరవనంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య విగ్రహం

నగరాలకు సమీపంలో..

అన్నమయ్య జిల్లాలో ప్రధానమైన రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె పట్టణాలకు సమీపంలో నగరవనాలు అందుబాటులోకి రానున్నాయి. నగరవనాల ద్వారా పట్టణ వాసులరే ఆహ్లాదం..ఆనందం అందుబాటులోకి రానున్నాయి. ఆరుకోట్ల రూపాయలు పైగా వ్యయం చేస్తూ నగర వనాలు ఏర్పాటు చేయాలని గత జగనన్న ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికి రూ.4కోట్ల వరకు ఖర్చు పెట్టింది.

రోజంతా..



పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన చిల్డ్రన్‌పార్కు

నగర వనాలు ఏర్పాటైతే పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా రోజంతా అక్కడ ఉల్లాసంగా గడపవచ్చు. ట్రెక్కింగ్, బోటింగ్, వాకింగ్ ట్రాక్, వన్యప్రాణాల విశిష్టతను వివరించే విజ్ఞాన కేంద్రాలు, ఎన్నో రకాల పక్షుల బొమ్మలు, వాచ్‌టవర్, వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. అలసిపోతే సేద తీరేందుకు అక్కడక్కడా పుట్టగొడుగుల ఆకారంలో ఉండే పగోడాలు, కుటుంబ సభ్యులు భోజనం చేసేందుకు క్యాంటిన్, పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కులు, ఆటవస్తులు ఇలా ఎన్నో నగర వనాల్లో ఏర్పాటు చేయనున్నారు. నామమాత్రపు ఫీజు (పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20)తో ప్రవేశించి నగరవనంలో అటవీ అందాలను కళ్లారా వీక్షించవచ్చు.

వనాల్లో పవిత్ర వృక్షాలు..

నగర వనాల్లో కేవలం ప్రకృతి అందాలకే పరిమితం చేయడం లేదు. వనాల్లో పవిత్ర వృక్షాలను ఏర్పాటు చేస్తున్నారు. సంప్రాదాయబద్ధంగా కావాల్సిన మొక్కలను పెంచనున్నారు. వివిధ దేవతామూర్తుల పేరిట మొక్కలు, పూలను కూడా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

క్లుప్తంగా

గ్రామ సచివాలయ శిలాఫలకం ధ్వంసం



పగలగొట్టిన శిలాఫలకం

బ్రహ్మంగారిమఠం : సోమిరెడ్డిపల్లె పంచాయతీ- 3 పరిధిలోని నరసన్నపల్లెలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని అప్పటి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించిన శిలాఫలాకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అప్పటి ప్రభుత్వం దాదాపు రూ.35 లక్షలు ఖర్చు చేసి గ్రామ సచివాలయం నిర్మించింది. ఎన్నికల ముందు ప్రారంభించారు. ప్రభుత్వం మారగానే ఈ శిలాఫలకంపై ఎవరికి ద్వేషం వచ్చిందో ఏమో గానీ పగలగొట్టారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఆ శిలాఫలకం స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తారా? లేదా పగల కొట్టిన వ్యక్తులపై కేసులు పెడతారా? అనే విషయాలు స్థానికులు చర్చించుకుంటున్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్ట్

అనంతపురం సిటీ: రైలు ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు అపహరించే ముగ్గురు అంతర్‌రాష్ట్ర దొంగలను అనంతపురం జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు గుత్తి పోలీసుల సహకారంతో శనివారం అరెస్టు చేశారు. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కుమ్మరంపల్లికి చెందిన బి.చిన్నికృష్ణ కుమారుడు భూక్యా సునీల్‌కుమార్ అలియాస్ సునీల్, అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగళ్ల గ్రామానికి చెందిన రమణారెడ్డి కొడుకు కోమలి వినయ్‌కుమార్‌రెడ్డి, అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లికి చెందిన ఎం.వెంకటనాయుడు కుమారుడు మాచినేని సంతోష్‌కుమార్ అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను ఎస్ఐ విజయకుమార్ మీడియాకు వెల్లడించారు. భూక్యా సునీల్‌కుమార్ అలియాస్ సునీల్, కోమలి వినయ్‌కుమార్‌రెడ్డి, మాచినేని సంతోష్‌కుమార్‌లు రైళ్లల్లో ఎక్కడం, తోటి ప్రయాణికులను ఏమార్చి వారి సెల్‌ఫోన్లు కొట్టేయడంలో దిట్టలని తెలిపారు. ఆ తరువాత 'మేం రైల్వే పోలీసులం. మీరు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ మాకు దొరికింది. ఒకసారి మీ సెల్‌ఫోన్ పాస్‌వర్డ్ చెబితే మీదో కాదో నిర్ధరించుకొని మీకు పంపుతామ'ంటూ' నమ్మిస్తారన్నారు. ఆ తరువాత బాధితులు పాస్‌వర్డ్ చెప్పగానే వారి సెల్‌ఫోన్లలోని వాట్సాప్, ఫేస్‌బుక్ అకౌంట్లకు రకరకాల కారణాలు చెబుతూ డబ్బు డిమాండ్ చేయడం పరిపాటిగా మారిందన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

రైల్వేలో మోగిన ఎన్నికల నగారా

- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సన్నాహాలు
- డిసెంబర్ 4, 5, 6లలో నిర్వహణపై దృష్టి
- మెంబర్‌షిప్ పరిశీలనకు రైల్వేబోర్డు ఆదేశాలు
- సిద్ధమవుతున్న ఎస్ఆర్‌ఎంయూ, సంఘ్

రైలుమార్గం	: ముంబయి-చెన్నై
డివిజన్	: గుంతకల్లు
బ్రాంచీలు	: నందలూరు, కడప,
ఎన్నికలు	: డిసెంబరు
ప్రధాన సంఘాలు	: మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్
పోలింగ్ కేంద్రాలు	: నందలూరు, కడప, రైల్వేకోడూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురం



రాజంపేట : భారతీయ రైల్వేలో ఎన్నికల నగారా మోగింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలకు రైల్వే యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల చేసి, ఎన్నికలకు అవసరమయ్యే చర్యలు తీసుకొనేందుకు డివిజన్ స్థాయిలో అధికారులకు బాధ్యతలు అప్పగించింది. రైల్వేబోర్డు ఆదేశాలతో ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్)కు అనుబంధంగా ఉన్న సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే (ఎన్ఎఫ్ఐఆర్)కు అనుబంధంగా ఉన్న సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకత్వాలు జోన్, డివిజన్ స్థాయిలో క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నాయి.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వేలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల వేడి రాజుకుంది. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో జిల్లా వరకు నందలూరు, కడప రైల్వే కేంద్రాలలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచీలు ఉన్నాయి. ఈ బ్రాంచీల పరిధిలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ సంఘాలను గెలిపించుకునేందుకు పోటీ పడుతున్నారు. రైల్వేబోర్డు ఆదేశాలతో కార్మిక సంఘాల నేతలు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు.

కోవిడ్‌తో వాయిదా వేస్తూ..

2013 ఏప్రిల్ మాసంలో భారతీయ రైల్వేలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. అప్పుడు సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ విజయఢంకా మోగించింది. 46 శాతం ఓట్లు దక్కించుకుంది. జోన్ స్థాయిలో 86 వేల ఓట్లలో 36 వేల ఓట్లను ఎస్ఆర్‌ఎంయూ సాధించింది. అయితే గుంతకల్లు డివిజన్ స్థాయిలో ఎస్ఆర్‌ఎంయూకు 694 ఓట్ల మెజార్టీ వచ్చింది. 2019లో ఎన్నికలు జరగాల్సి ఉండగా.. కోవిడ్ కారణంతో రైల్వే యాజమాన్యం వాయిదా వేస్తూ వచ్చింది. 2024లో డిసెంబరు 4, 5, 6 తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

సీక్రెట్ బ్యాలెట్ ద్వారా..

రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ సీక్రెట్ బ్యాలెట్ ద్వారా నిర్వహించడం జరుగుతుంది. గత ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతిలో నిర్వహించారు. నందలూరు, రైల్వేకోడూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటి పరిధిలో ఉన్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కు నియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలు ఇరు కార్మిక సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. గుంతకల్లు డివిజన్ పరిధిలో 13 వేల మంది సభ్యులుగా ఉన్నారు.

గెలుపు మాదే



రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో గెలుపు మాదే అన్న ధీమాలో ఉన్నాం. గత ఎన్నికలలో కూడా ఏఐఆర్‌ఎఫ్(ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్) దాని అనుబంధసంస్థ ఎస్ఆర్‌ఎంయూ(సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్)కు మెజార్టీ ఓట్లు వచ్చాయి. కార్మికుల సమస్యలుపై రాజీలేని పోరాటం చేసే సంఘం మాది. ఈ ఎన్నికల్లో కూడా కార్మికులు తమ పక్షాన నిలుస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నాం.

– విజయ్‌కుమార్, డివిజనల్ సెక్రటరీ, ఎస్ఆర్‌ఎంయూ

ఈ సారి మాదే విజయం



రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో ఈ సారి విజయం మాదే అనే ధీమాలో ఉన్నాం. కార్మికుల సమస్యల పరిష్కారంలో నేషనల్ ఫెడరేషన్ ఇండియన్ రైల్వేమెన్ దాని అనుబంధం సంఘం సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ముందంజలో ఉంటుంది. కాబట్టి ఎన్నికలలో కార్మికులు సంఘ్‌ను ఆదరిస్తారని ప్రగాఢ విశ్వాసం ఉంది. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమం కోసం కృషి చేసే ఏకైక కార్మిక సంఘం ఎన్ఎఫ్ఐఆర్.

– బీ.బాబు, డివిజనల్ ప్రెసిడెంట్, సంఘ్

'సీమ' ఉద్యమ నేత వేణుగోపాల్‌రెడ్డి మృతి



వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : రాయలసీమ ఉద్యమ నాయకుడు, కుందూ పోరాట సమితి కన్వీనర్ కోవెలకుంట్ల పట్టణానికి చెందిన కామిని వేణుగోపాల్‌రెడ్డి (75) మృతి చెందారు. ఆయన ఆర్మీలో కొంత కాలం పని చేసిన తర్వాత రాయలసీమ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఒకప్పటి ఉప ముఖ్యమంత్రి బీవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివంగత కర్రా సుబ్బారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులతో కలిసి పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. కుందూ పోరాట సమితి ఏర్పాటు చేసి కుందూనదిని జీవనదిగా ఉంచాలని ప్రభుత్వాలను కోరుతూ వచ్చారు. కుందూపై రాజోలు, జొలదరాశి ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పలు ఆందోళనలు నిర్వహించారు. రాయలసీమ సాగునీటి కష్టాలు తీరేందుకోసం సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై అలుగు నిర్మాణం చేపట్టాలని సాగిన ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. కుందూ పరీవాహక ప్రాంత రైతుల సమస్యలను ముఖ్యమంత్రులు, మంత్రుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి పరిష్కరింపజేశారు. రేనాటి సూర్యచంద్రులుగా ప్రసిద్ధి గాంచిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి స్మారకంగా కోవెలకుంట్ల పట్టణంలో పెద్ద పార్కు ఏర్పాటులో ప్రధానపాత్ర పోషించారు. వేణుగోపాల్‌రెడ్డి మృతి పట్ల రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి రాయలసీమ వాసులకు తీరని లోటన్నారు. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీవారి లడ్డూ వివాదంపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేత బి. రామమహేష్

కడప కల్చరల్ : తిరుమలేశుని లడ్డూలో కల్తీ జరిగిందని వస్తున్న ఆరోపణలపై సుప్రీం కోర్టు లేదా సీబీఐ విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెస్తవేముల రామమహేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత బస్టాండు వద్ద గల వీహెచ్‌పీ కార్యాలయంలో ఆయన సంస్థతోపాటు ఇతర హిందూ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ఆధారాలు లేకుండా ఇలాంటి అంశాలను ఈ స్థాయిలో ప్రచారం చేయడం మంచిది కాదని సూచించారు. తమ రాజకీయ లబ్ధి కోసం నాయకులు ఇలాంటి వాటిని ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. స్పష్టత లేకపోయినా సాక్షాత్తు సీఎం స్థాయి వ్యక్తే ప్రపంచంలోని హిందువులందరి మనోభావాలను దెబ్బతీసేలా ప్రచారం చేస్తుండడం భావ్యం కాదన్నారు. ఇందులో పూర్తి స్థాయి నిజనిర్ధారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై స్పష్టత వచ్చేంత వరకు ఐదారు రోజుల్లో నిరసన వ్యక్తం చేస్తూ కార్యచరణను రూపొందించుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, దాని అనుబంధ సంస్థల ప్రతినిధులు వెంకట్రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, సురేంద్ర, రమాదేవి, ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రమేష్, లక్ష్మినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలను ప్రజలకు తెలపాలి

వైవీయూ : తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంపై జరుగుతున్న వివాదంపై సుప్రీంకోర్టు సెట్టింగ్ జడ్జి నేతృత్వంలో సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు తెలపాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలోనే అనుమానాలు వచ్చినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రాజకీయ స్వలాభాల కోసం తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లే విధంగా సాక్షాత్తు శ్రీవారి ప్రసాదంపై నిందలు వేయడం తగదన్నారు.

వంద రోజుల పాలనలో సూపర్ సిక్స్ లేదు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎవరికీ మంచి చేయకపోగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి ప్రజల ముందు దోషిగా నిలిచారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఏలుబడిలో సూపర్‌సిక్స్ ఎక్కడా కనిపించడం లేదన్నారు. పైగా తమది మంచి ప్రభుత్వమని ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించమంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో.. ఎక్కడైనా పిల్లలు కనిపిస్తే నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు సంతోషమా అన్నారని, మహిళలు కనిపిస్తే నీకు రూ.18 వేలు, యువత కనపడితే నీకు రూ.36 వేలు, 50 ఏళ్లు దాటిన పెద్దమ్మ కనిపిస్తే నీకు రూ.48 వేలు, రైతు కనపడితే ఏటా రూ.20 వేలు ఇస్తాం.. సంతోషమా? అంటూ నమ్మబలికారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఆశలు చూపించి గెలుపొందారని, ఇప్పుడు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. వంద రోజుల్లో చంద్రబాబు చేసింది మోసం మాత్రమేనన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టి మరల్చేందుకు ఇలాంటి నాటకాలకు తెరలేపారన్నారు. రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి ఆరోపణ చేసినందున దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్ట్

1.5 కిలోల గంజాయి, 3 బైక్‌లు, రూ.14,800 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కడప ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్

కమలాపురం : జాతీయ రహదారిలో తిరిగే లారీలను లక్ష్యంగా చేసుకుని.. డ్రైవర్లను కొట్టి చంపుతామని బెదిరించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, నగదును దోచుకునే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కడప ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్ వివరాలు వెల్లడించారు. నేషనల్ హైవేలలో దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడానికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో కమలాపురం, సీసీఎస్ సీఐలు షేక్ రోషన్, భాస్కర్‌రెడ్డి, కమలాపురం, వల్లూరు ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, సంజీవ రాయుడు ల టీంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశాయి. చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన దుంపల వినోద్ కుమార్ చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించడం కోసం గుజ్జు సాయి, సి.ప్రశాంత్, పి.ఉదయ్ కుమార్, వై.మురళీధర్, ఎస్.ఆదికేశవరెడ్డి, కె.వెంకట సుబ్బయ్య, సి.నరహరితోపాటు మరో 17 ఏళ్ల బాలునితో కలసి ముఠాగా ఏర్పడి వారికి గంజాయి సేవించడం అలవాటు చేశాడు. ఈ ముఠా రాత్రి సమయాల్లో ఒంటిమిట్ట, బద్వేలు, వల్లూరు, ముద్దనూరు, రాయచోటి, ఎర్రగుంట్ల, కమలాపురం, చాపాడు తదితర పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని హైవేల మీద తిరిగే లారీలను ఆపి డ్రైవర్లను కొట్టి, కత్తులు చూపి చంపుతామని బెదిరించి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, నగదును దోచుకునేది. వినోద్‌కుమార్ వైజాగ్ నుంచి గంజాయి తీసుకువచ్చి తన ముఠాతో విక్రయించి అక్రమ సంపాదనకు పాల్పడుతూ చదువుకునే విద్యార్థులను చెడు అలవాట్లకు దారి మళ్లించి వారి జీవితాలను నాశనం చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన చాపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో లారీ డ్రైవర్‌పై దాడి చేసి మొబైల్ ఫోన్, రూ.9 వేల నగదు, 15న ఒంటిమిట్ట పీఎస్ పరిధిలో మొబైల్ రూ.15 వేలు, 18న వల్లూరు పీఎస్ పరిధిలో మొబైల్, రూ.3500 నగదు, 20న ముద్దనూరు పీఎస్ పరిధిలో రెండు మొబైల్ ఫోన్లు, 10 గ్రాముల బంగారు ఉంగరం, రూ.15 వేలు, ఎర్రగుంట్ల పీఎస్ పరిధిలో మొబైల్ రూ.7500, కమలాపురం పీఎస్ పరిధిలో రూ.4500 దోచుకున్నారు. కొందరు బాధితులు చేసిన ఫిర్యాదుతో.. ఎస్పీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారు కమలాపురం మండలం గంగవరం ఆర్చి వద్ద శనివారం ఉదయం 9 గంటలకు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, రూ.14800 నగదు, 3 బైక్‌లు, 3 కత్తులు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముఠాను చాకచక్యంగా పట్టుకున్న రోషన్, భాస్కర్‌రెడ్డి బృందాలను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ బృందాలకు రివార్డు ఇవ్వాలని ఎస్పీని కోరుతామని డీఎస్పీ తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని, వారు చదువుతున్నారా లేదా? ఏమి చేస్తున్నారు అనే విషయాలపై అప్పుడపుడు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన వారిలో నలుగురు బీటెక్ స్టూడెంట్స్ ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐలు ఎస్‌కే రోషన్, భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, సంజీవ రాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో చోరీలు

రెండు ప్రాంతాల్లో సినీ ఫక్కీలో చోరీలకు పాల్పడ్డారు. ముద్దనూరు మండలంలో పోలీసులమని నమ్మించి వృద్ధ దంపతుల నుంచి నగలు అపహరించారు. పోరుమామిళ్లలో మీ రూ.100 నోటు కింద పడిందని యువకులు చెప్పి.. లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ రెండు ఘటనలు జిల్లాలో సంచలనంగా మారాయి.

ముద్దనూరు : 'దొంగతనాలు జరుగుతున్నాయి, మేము పోలీసులం, మీరు ఇలా మెడలో పట్టపగలే బంగారు నగలు ధరించి వెళితే.. ఎవరైనా దోచుకెళితే ఎలా?' అని నమ్మబలికి వృద్ధ దంపతుల నుంచి బంగారు నగలు అపహరించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. మండలంలోని బొందలకుంటకు చెందిన పుల్లయ్య, వెంకటసుబ్బమ్మ కడపలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి.. తిరిగి మధ్యాహ్న సమయంలో స్వగ్రామానికి టీవీఎస్ స్కూటీలో వెళ్తున్నారు. బొందలకుంట రహదారిలోకి మలుపు తిరగగానే రెండు మోటార్ బైక్‌లలో నలుగురు వ్యక్తులు వచ్చి వారిని ఆపారు. తాము పోలీసులమని, ఇక్కడ దొంగతనాలు జరుగుతున్నాయని, మీరు మెడలో బంగారు నగలు వేసుకుని వెళ్తున్నారు, ఎవరైనా దొంగతనం చేస్తే మాకు చెడ్డ పేరు వస్తుంది, నగలు తీసి కనిపించకుండా పెట్టుకుని వెళ్లండి అని చెప్పారు. తాము 5 నిమిషాల్లో గ్రామానికి చేరుతాము మాకు భయం లేదు అని ఆ దంపతులు అన్నారు. అయినప్పటికీ వినకుండా ఆమె మెడలోని నగలను తీయించి ఒక కవరులో వేసినట్లు నటించి, తమ దగ్గర అప్పటికే వున్న ఓ కవరును వారికి ఇచ్చి చీర కొంగులో కట్టుకుని వెళ్లండి అని చెప్పారు. కొద్ది దూరం వెళ్లగానే వారు చీరకొంగులో దాచిన కవరును విప్పి చూశారు. అందులో నగల బదులు రాళ్లు వుండడంతో కంగుతిన్నారు. వెంటనే వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణ చేపట్టారు. సుమారు మూడు తులాల బంగారు నగలు దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పోలీసులమని చెప్పి చోరీ చేయడంపై స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

బ్యాంక్ నుంచి డబ్బు తీసుకుని వస్తుండగా..

పోరుమామిళ్ల : మీ డబ్బు కింద పడిందని చెప్పి చోరీ చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోరుమామిళ్ల స్టేట్‌బ్యాంక్‌లో శుక్రవారం మధ్యాహ్నం బి.కోడూరు మండలం అమ్మవారిపేటకు చెందిన చెముడూరి చిన్న గురయ్య రూ.1,64,000 డ్రా చేసుకుని తీసుకొని వెళ్లడాన్ని ఇద్దరు వ్యక్తులు గమనించారు. వారు అతన్ని బైక్‌లో ఫాలో అయ్యారు. సీతారాంపురం క్రాస్ రోడ్ వద్ద వంద రూపాయలు కింద వేసి, గురయ్యతో మీ డబ్బు కింద పడిందని చెప్పారు. ఆయన వెంటనే బైక్ నిలబెట్టి వంద రూపాయల కోసం దిగాడు. అంతే ట్యాంక్ కవర్‌లో పెట్టిన క్యాష్ బ్యాగ్ తీసుకుని వారు పరారయ్యారు. గురయ్య తేరుకుని చూసేటప్పటికి.. వారు, క్యాష్ బ్యాగ్ కనిపించలేదు. సాయంత్రం దాకా వెతికినా ఫలితం లేకపోవడంతో.. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. డబ్బు చోరీ చేసినవారు హెల్మెట్లు పెట్టుకొని ఉండటం వల్ల గుర్తు పట్టడం కష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని ఊటుకూరు సర్కిల్ వద్ద శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో సివిల్ సప్లై విజిలెన్స్ సీఐ హమీద్ ఖాన్ ఆధ్వర్యంలో పలు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమ లోడుతో వెళుతున్న 494 బస్తాల రేషన్ బియ్యం లారీని పట్టుకొని సీకే దిన్నె పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు రూరల్ సీఐ శివ శంకర్ నాయక్ శనివారం తెలిపారు. మైదుకూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న లారీని తనిఖీ చేయడంతో అందులో 494 బస్తాల బియ్యం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వాటి విలువ దాదాపు లక్ష 6,525 రూపాయలుగా గుర్తించామన్నారు. ఈ విషయమై మైదుకూరుకు చెందిన రైస్ మిల్లు యజమాని మాచునూరు సుధీర్‌తోపాటు మాచునూరుకు చెందిన లారీ ఓనర్ సుబ్బరాయుడువిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి వద్ద నుంచి 116 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పి.నరేష్‌బాబు శనివారం తెలిపారు. పాండిచ్చేరి నుంచి తాడిపత్రికి రైలులో మద్యం బాటిళ్లను తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 116 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

లారీలు ఢీకొని.. డ్రైవర్‌కు గాయాలు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవునికడప బైపాస్ రోడ్‌లో శనివారం రాత్రి రెండు లారీలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. అయితే ఈ ప్రమాదం వల్ల ట్రాఫిక్ స్తంభించి పోయింది. సమాచారం తెలుసుకున్న చిన్నచౌక్ సీఐ ఎస్.తేజమూర్తి, ఎస్ఐ పి.రవికుమార్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. వాహనాల రాకపోకలకు వీలుగా లారీలను క్రేన్‌ల సహాయంతో రోడ్డుకు పక్కకు జరిపించారు. గాయపడ్డ డ్రైవర్‌ను రిమ్స్‌కు పంపించారు.

ఆర్టీపీపీలో ఇనుప సామగ్రి అపహరణ

ఎర్రగుంట్ల : మండల పరిధి డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని 6వ యూనిట్‌లో ఉన్న వియోటెక్ కంపెనీలో చోరీ జరిగింది. కలమల్ల ఎస్ఐ తిమోతి శనివారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీపీపీలోని 6వ యూనిట్‌లో వియోటెక్ కంపెనీ నిర్మాణ పనులు చేపడుతోంది. ఉదయాన్నే స్టోర్ ఇన్‌చార్జి వంగలి ప్రసాద్‌రెడ్డి వెళ్లి చూడగా స్టోర్‌లో కంపెనీకి సంబంధించిన సుమారు రూ.2.40 లక్షల విలువైన ఇనుప వస్తువులు కన్పించలేదు. దీంతో ఆయన పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి సమాచారం తెలియజేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. దొంగలు తీసుకోవడానికి కంపచెట్లలో పడేసిన ఇనుప వస్తువులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.